PRGI NO:TGTEL/26/A0383

డైనమిక్

# జనం వాయిస్

తెలుగు దినపత్రిక

WWW.JANAMVOICE.COM

06-10-2026

5PM

స్పెషల్ ఎడిషన్


## శంషాబాద్‌లో భారీ ఏటీఎం చోరీ

### సుమారు రూ.20 లక్షల నగదు అపహరణ

**జనం వాయిస్, శంషాబాద్, అక్టోబర్ 6:**



శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ ఏటీఎం చోరీ కలకలం రేపింది. సాతం రాయ్ ప్రాంతంలోని యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంను దుండగులు టార్గెట్ చేసి గ్యాస్ కట్టర్లతో ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేసి సుమారు రూ.20 లక్షల నగదును అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. పక్కా ప్రణాళికతో చోరీ: తెల్లవారుజామున ఏటీఎం వద్దకు చేరుకున్న దుండగులు ముందస్తు ప్రణాళిక ప్రకారం చోరీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఏటీఎంలోని సీసీ కెమెరాలపై స్ప్రే కొట్టి, వైర్లను కట్ చేసి ఆధారాలు లభించకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. గ్యాస్ కట్టర్లతో ఏటీఎం ధ్వంసం: అనంతరం గ్యాస్ కట్టర్ల సాయంతో ఏటీఎం మిషన్‌ను కోసి అందులోని నగదును ఎత్తుకెళ్లారు. ఏటీఎం వద్ద రాత్రి వేళ నైట్ వాచ్‌మన్ లేకపోవడం దుండగులకు అనుకూలంగా మారినట్లు పోలీసులు భావిస్తున్నారు. సంఘటనా స్థలానికి పోలీసులు: చోరీ విషయం వెలుగులోకి రావడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఏటీఎం పరిసరాలను పరిశీలించి ఆధారాలను సేకరిస్తున్నారు. దొంగల కోసం గాలింపు: సీసీ కెమెరాల ఫుటేజీతో పాటు ఇతర ఆధారాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. చోరీ వెనుక స్థానికుల ప్రమేయం ఉందా? లేక ముందుగానే రెక్కీ నిర్వహించిన దొంగల ముఠా పనేనా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితులను గుర్తించి పట్టుకునేందుకు పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు.

## హిందీ నేర్చుకోవాలంటూ ఉద్యోగులపై బెంగళూరు జొమాటో సూపర్వైజర్ ఒత్తిడి.. చివరకు క్షమాపణ

హిందీ నేర్చుకోండి, లేదంటే వెళ్ళిపోండి అన్న జొమాటో సూపర్వైజర్.

వీడియో వైరల్ కావడంతో కన్నడ సంఘాల తీవ్ర నిరసన.

బాధ్యులపై చర్యలు తీసుకుంటామని జొమాటో హామీ.

**జనం వాయిస్, బెంగళూరు అక్టోబర్ 6:**

జొమాటో వేర్‌హౌస్‌లో పనిచేసే స్థానిక ఉద్యోగులు హిందీ నేర్చుకోవాలని, లేదంటే ఉద్యోగం మానేయాలని హుకుం జారీ చేసిన ఓ సూపర్వైజర్, తీవ్ర వివాదం చెలరేగడంతో చివరకు క్షమాపణ చెప్పాడు. బెంగళూరులోని మకాలి సమీపంలో ఉన్న జొమాటో గోదాములో ఈ ఘటన జరిగింది. ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కన్నడ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. వివరాల్లోకి వెళితే, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అశోక్ అనే వ్యక్తి జొమాటో వేర్‌హౌస్‌లో సూపర్వైజర్‌గా పనిచేస్తున్నాడు. "నాకు కన్నడ రాదు, నేను హిందీలోనే మాట్లాడతాను. ఇక్కడ పనిచేయాలంటే మీరు హిందీ నేర్చుకోవాల్సిందే. లేదంటే ఉద్యోగం మానేసి వెళ్లిపోండి" అని ఉద్యోగులతో అతను చెప్పిన మాటలు వీడియోలో రికార్డ్ అయ్యాయి. ఇది కర్ణాటక అని ఓ ఉద్యోగి గుర్తుచేయగా... అయితే ఏంటి? అని అతను బదులిచ్చాడు. ఈ వీడియో బయటకు రావడంతో కన్నడ సంఘాలు వేర్‌హౌస్ వద్దకు చేరుకుని నిరసన చేపట్టాయి. సూపర్వైజర్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశాయి. దీనిపై మదనాయకనహల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా నమోదైంది. దీంతో పోలీసులు అశోక్‌ను కాసేపు అదుపులోకి తీసుకుని, పరిస్థితిని చక్కదిద్దారు. నిరసనకారులతో మాట్లాడిన జొమాటో యాజమాన్యం, సదరు సూపర్వైజర్‌ను విధుల నుంచి తొలగిస్తామని హామీ ఇచ్చింది. విమర్శలు వెల్లువెత్తడంతో అశోక్, కన్నడలో చేతులు జోడించి క్షమాపణ చెబుతూ మరో వీడియో విడుదల చేశాడు. తాను మాట్లాడిన మాటలు తప్పేనని, భవిష్యత్తులో ఇలాంటి పొరపాటు చేయనని పేర్కొన్నాడు. ఈ ఘటనతో కర్ణాటకలోని కార్యాలయాల్లో భాషా సున్నితత్వంపై మరోసారి చర్చకు దారితీసింది.



## వివాహితపై కానిస్టేబుల్ అత్యాచారం.

**వీడియోలతో బెదిరింపులు.**
**రూ.1.30 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణ.**

**జనం వాయిస్, కరీంనగర్, అక్టోబర్ 6:**



పదో తరగతి నాటి పరిచయాన్ని ఆసరాగా చేసుకుని ఓ వివాహితపై టీజీఎస్పీ కానిస్టేబుల్ అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. అంతేకాకుండా ఘటనను రహస్యంగా వీడియో చిత్రీకరించి, వాటిని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తానంటూ బెదిరించి బాధితురాలి నుంచి రూ.1.30 లక్షలు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి తన భర్తతో కలిసి కరీంనగర్‌లో నివసిస్తోంది. ఆమెకు పదో తరగతిలో పరిచయమైన ఉదయ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని టీజీఎస్పీ ఎనిమిదో బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. పాత పరిచయంతో ఆమెతో తరచూ ఫోన్‌లో మాట్లాడేవాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఏడాది మార్చి 3న కరీంనగర్‌లో ఉదయ్ తనపై అత్యాచారానికి పాల్పడి, ఆ ఘటనను రహస్యంగా చిత్రీకరించాడని బాధితురాలు ఆరోపించింది. అనంతరం ఆ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పెడతానంటూ బెదిరిస్తూ పలుమార్లు లైంగికంగా వేధించాడని తెలిపింది. వీడియోలను బయటపెడతానంటూ బెదిరించి ఆగస్టు 20, 21 తేదీల్లో తన నుంచి రూ.1.30 లక్షలు తీసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. డబ్బులు ఇచ్చిన తర్వాత కూడా వేధింపులు ఆగలేదని బాధితురాలు తెలిపింది. ఉదయ్ తన ఇంటికి వచ్చి గొడవ చేయడంతోపాటు, తనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను భర్తకు పంపినట్లు ఆరోపించింది. వాటిని చూసిన భర్త, కుటుంబసభ్యులు ఆమెను ఇంటి నుంచి పంపించినట్లు పేర్కొంది. ఈ వేధింపుల కారణంగా తాను గర్భిణిగా ఉన్న సమయంలో గర్భస్రావం కూడా జరిగిందని బాధితురాలు ఫిర్యాదులో తెలిపింది. ఈ ఘటనపై బాధితురాలు తొలుత జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఓ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును కరీంనగర్ గ్రామీణ పోలీసులకు బదిలీ చేశారు. దీంతో కరీంనగర్ గ్రామీణ పోలీసులు నిందితుడు ఉదయ్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## జూబ్లీహిల్స్‌లో బీఎండబ్ల్యూ కారును అడ్డుకుని డబ్బులు డిమాండ్

### మహిళల వేషధారణలో ఉన్న నలుగురు అరెస్ట్

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 6:**



హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ప్రాంతంలో బీఎండబ్ల్యూ కారును అడ్డుకుని డబ్బులు డిమాండ్ చేసిన ఘటనలో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. నలుగురు వ్యక్తులు మహిళల మాదిరిగా చీరలు ధరించి జూబ్లీహిల్స్‌లో రోడ్డుపైకి వచ్చారు. అనంతరం ఓ బీఎండబ్ల్యూ కారును అడ్డుకుని అందులో ఉన్న వ్యక్తి నుంచి డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. నలుగురు కలిసి కారును అడ్డుకోవడంతో వాహనదారుడు ఇబ్బందికి గురైనట్లు తెలుస్తోంది. ఈ ఘటనను కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అది వైరల్‌గా మారింది. వీడియో ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు కారును అడ్డుకున్న నలుగురిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ప్రాథమిక విచారణలో వారు పురుషులని, డబ్బులు వసూలు చేయాలనే ఉద్దేశంతో మహిళల మాదిరిగా దుస్తులు ధరించినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. నగరంలోని ట్రాఫిక్ సిగ్నల్స్, మార్కెట్లు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో డబ్బులు అడుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఫిర్యాదులు గతంలోనూ వచ్చాయి. డబ్బులు ఇవ్వకపోతే ఒత్తిడి చేయడం, వాహనాలను అడ్డుకోవడం వంటి ఘటనలు జరుగుతున్నాయని పలువురు ఫిర్యాదు చేస్తున్నారు. అయితే చట్టవిరుద్ధంగా డబ్బులు వసూలు చేసే ఘటనలను మొత్తం ట్రాన్స్‌జెండర్ సమాజానికి ఆపాదించకూడదని సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు. వ్యక్తుల లింగ గుర్తింపుతో సంబంధం లేకుండా చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పేర్కొంటున్నారు. జూబ్లీహిల్స్ ఘటనలో నలుగురి అరెస్టుతో బహిరంగ ప్రదేశాల్లో డబ్బుల వసూళ్ల అంశం మరోసారి చర్చకు వచ్చింది. వైరల్ వీడియో ఆధారంగా కేసు దర్యాప్తు కొనసాగుతోందని, తదుపరి విచారణలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి బెయిల్.

జైలు నుంచి విడుదల.
లైంగిక వేధింపుల కేసులో ట్రైనీ ఐపీఎస్‌కు బెయిల్.
67 రోజుల తర్వాత జైలు నుంచి ఉదయ్ కృష్ణారెడ్డి విడుదల.

**జనం వాయిస్, హైదరాబాద్ :**

లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో అరెస్టయిన ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డికి ఊరట లభించింది. సుమారు 67 రోజులుగా జైల్లో ఉన్న ఆయనకు హైదరాబాద్‌లోని ఉప్పరపల్లి కోర్టు మంగళవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన చర్లపల్లి జైలు నుంచి విడుదలయ్యారు. గతంలో ఉదయ్ కృష్ణారెడ్డి తనను లైంగికంగా వేధిస్తున్నారని ఆరోపిస్తూ, ఆయన సహచర మహిళా ఐపీఎస్ అధికారి అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు అనంతరం ఉదయ్ కృష్ణారెడ్డిని అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. అప్పటి నుంచి ఆయన చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. తాజాగా ఈ కేసులో విచారణ జరిపిన ఉప్పరపల్లి కోర్టు, ఆయనకు బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి బయటకు వచ్చారు.



## ఫేక్ సర్టిఫికెట్ల బాగోతం: తెలంగాణలో 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల తొలగింపు

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 6:**



తెలంగాణలో నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లను ఇంటర్మీడియట్ విద్యాశాఖ విధుల నుంచి తొలగించింది. వారు సమర్పించిన సర్టిఫికెట్లు నకిలీవని ధ్రువీకరణ కావడంతో ఈ కఠిన చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదట కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేసిన వీరందరినీ 2023లో ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసింది. అయితే, వారి విద్యార్హత పత్రాలపై అనుమానాలు రావడంతో ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆ సర్టిఫికెట్లను సంబంధిత విశ్వవిద్యాలయాలకు వెరిఫికేషన్ కోసం పంపింది. పరిశీలన అనంతరం ఆ సర్టిఫికెట్లు నకిలీవని యూనివర్సిటీలు తేల్చి చెప్పాయి. దీంతో విద్యాశాఖ సదరు లెక్చరర్లకు షో-కాజ్ నోటీసులు జారీ చేసి, వారి వివరణ తీసుకున్న తర్వాత సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఉద్యోగాలు కోల్పోయిన వారిలో రాజన్న-సిరిసిల్ల జిల్లా నుంచి ఆరుగురు ఉండగా, పెద్దపల్లి, సిద్దిపేట, సూర్యాపేట జిల్లాల నుంచి ముగ్గురు చొప్పున ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, ఖమ్మం, నిర్మల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి ఇద్దరేసి లెక్చరర్లు ఉన్నారు. మరో ఎనిమిది జిల్లాల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఈ జాబితాలో ఉన్నారు. ఇదే తరహా ఆరోపణలపై గతంలో సుమారు 10 మంది లెక్చరర్లను తొలగించినట్లు సమాచారం. ప్రస్తుతం మరో 320 మంది లెక్చరర్ల సర్టిఫికెట్లను కూడా వెరిఫికేషన్ కోసం యూనివర్సిటీలకు పంపినట్లు అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంపై సీబీ-సీఐడీ, విజిలెన్స్ విచారణ జరిపించాలని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఛైర్మన్ డాక్టర్ పి. మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. గతంలో ఈ నకిలీ పత్రాలను పరిశీలించి, ధ్రువీకరించిన అధికారుల పాత్రపై కూడా విచారణ జరపాలని ఆయన కోరారు. మోసం రుజువైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లు సమర్పించారని నిర్ధారణ.**
**కాంట్రాక్టు నుంచి రెగ్యులరైజ్ అయ్యాక వెలుగులోకి బాగోతం**
**మరో 320 మంది లెక్చరర్ల సర్టిఫికెట్లపై కొనసాగుతున్న విచారణ.**
**ఈ వ్యవహారంపై సీబీ-సీఐడీ విచారణకు జేఏసీ డిమాండ్.**

## గుప్త నిధుల కలకలం

**బండమీదిపల్లి వద్ద ఓ పురాతన దేవాలయం వద్ద జెసిబి తో గుప్త నిధులు తవ్వుతుండగా పోలీసుల దాడులు**

**జనం వాయిస్,వికారాబాద్, అక్టోబర్ 6:**

యాలాల మండలంలో తీవ్ర కల కలం రేపిన గుప్తనిధుల త్రవ్వకాల సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే యాలాల మండలం జుంటిపల్లి శ్రీరాములవారి ప్రాజెక్టు వద్ద ఓ పురాతన ఆలయం వద్ద కొందరు గుప్తనిధులు త్రవ్వకాలు చేపట్టినట్టు సమాచారం అందుకున్న యాలాల పోలీసులు అక్కడ దాడులు జరుపగా ఆరుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. పోలీసుల రాకతో మరో ముగ్గురు వ్యక్తులు పరారయ్యారు. ఈ సంఘటన అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో చోటు చేసుకున్నట్లు తెలిసింది. పోలీసుల అదుపులో ఉన్న వారిలో అక్కంపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ భర్త తో పాటు మరో గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తదితరులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. ఈ దాడిలో ఓ జెసిబి తో పాటు రెండు కార్లను సీజ్ చేసి యాలాల పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుగుతున్నట్లు యాలాల ఎస్సై విఠల్ రెడ్డి పేర్కొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి కుటుంబంపై ఆరోపణలు: బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ అరెస్ట్

**సికింద్రాబాద్ మెడికవర్ ఆసుపత్రి వద్ద బ్యానర్లు ఏర్పాటు చేశారన్నది ప్రధాన ఆరోపణ.**
**ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే అరెస్ట్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శ.**
**ఈ ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.**

**జనం వాయిస్, హైదరాబాద్, అక్టోబర్ 6:**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబంపై ఆరోపణలు చేస్తూ వివాదాస్పద బ్యానర్లు ఏర్పాటు చేసిన కేసులో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నేత, ఆ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌ను గోపాలపురం పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్‌లోని మెడికవర్ ఆసుపత్రి వద్ద అభ్యంతరకర రీతిలో బ్యానర్లు ప్రదర్శించారన్న అభియోగంపై ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం, మెడికవర్ ఆసుపత్రికి సంబంధించి రూ. 13,200 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగాయని ఆరోపిస్తూ క్రిశాంక్ తన అనుచరులతో కలిసి ఆసుపత్రి వెలుపల బ్యానర్లు ఏర్పాటు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ముఖ్యమంత్రి చిత్రపటాన్ని ఉపయోగిస్తూ, ఆయనకు అభినందనలు తెలుపుతున్నట్లుగా వ్యంగ్యంగా వీటిని రూపొందించారు. దీనిపై కాంగ్రెస్ నాయకుడు మెట్టు సాయి కుమార్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్), సైబర్ క్రైమ్ విభాగాలకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు అక్టోబర్ 5న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో క్రిశాంక్, 'వీ= మీడియా తెలంగాణ" ప్రతినిధులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్లు 353(2), 352 కింద కేసులు నమోదయ్యాయి. అరెస్టుకు ముందు క్రిశాంక్ ఈ వ్యవహారంపై స్పందిస్తూ, వివాదాస్పద లావాదేవీల ద్వారా నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి కుటుంబానికి చెందిన వ్యాపార ఆస్తులు, ఆర్థిక లావాదేవీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)తో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే కేసులో గతంలో బీఆర్ఎస్ నాయకులు సాయికిరణ్, వినీత్‌లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. క్రిశాంక్ అరెస్టును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి అవినీతిని ప్రశ్నించినందుకే కక్షపూరితంగా క్రిశాంక్‌ను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని, ప్రభుత్వ వైఫల్యాలను నిరంతరం ఎండగడుతూనే ఉంటామని ఆయన సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశారు. మరోవైపు బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని ప్రభుత్వం, కాంగ్రెస్ నేతలు కొట్టిపారేశారు. ముఖ్యమంత్రి కుటుంబానికి మెడికవర్ ఆసుపత్రితో ఎటువంటి వ్యాపార సంబంధాలు లేవని తెలంగాణ ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. తాజా అరెస్టు పరిణామాలతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలు మరింత ముదిరాయి.